క్లుప్తంగా

సీసీరోడ్డు పనుల పరిశీలన



ఖిల్లాఘనపురం: మండల కేంద్రం నుంచి ఆగారం మీదుగా కమాలోద్దీన్‌పూర్ గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా చేపడుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం పంచాయతీరాజ్ ఏఈ కబీర్‌దాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మున్నూరు జయకర్ పరిశీలించారు. కమాలోద్దీన్‌పూర్ గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డుకు ఆగారం గ్రామ సమీపంలో సీసీ వేస్తున్నామని ఏఈ తెలిపారు. నాణ్యతతో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. మండలంలోని అప్పారెడ్డిపల్లి, సల్కెలాపురం తదితర గ్రామాలకు వేసిన రోడ్లకు సైతం గ్రామాల సమీపంలో సీసీ రోడ్లు వేస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే అన్ని గ్రామాల వద్ద రోడ్ల నిర్మాణం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి



ఆత్మకూర్: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మండల విద్యాధికారి భాస్కర్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు విద్యాహక్కు చట్టం అమలు చేయాలని, ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, టై, బెల్టు, షూస్, యూనిఫాంలు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజు, మోష, ప్రసాద్, భీమన్న, లింగన్న తదితరులు ఉన్నారు.

ఎల్వోసీ అందజేత



పెబ్బేరు రూరల్: మండలంలోని శాఖాపూర్.వై గ్రామానికి చెందిన శంకర్ కుమార్తె అనారోగ్య సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధిత కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి ఆయన రూ.2.50లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఎల్‌ఓసీ కాపీని మంగళవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో బాధిత కుటుంబ సభ్యుడికి అందజేశారు.

ఇంటింటికీ నల్లా కనెక్షన్



పెబ్బేరు రూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు వనపర్తి మండలంలోని పెద్దగూడెంతండా గ్రామ పంచాయతీలో మిషన్ భగీరథ నల్లాల కనెక్షన్ సర్వేను ఎంపీడీఓ రాఘవ మంగళవారం పరిశీలించారు. ఈ సర్వే ద్వారా గ్రామంలో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు, కుటుంబాల సంఖ్య, నల్లా కనెక్షన్ లేని ఇళ్ల గురించి ఆరా తీశారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కార్యదర్శి రామచంద్రయ్యకు తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటారు వితరణ



ఆత్మకూర్: మండలంలోని గుంటిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికి రూ.30 వేలు వెచ్చించి బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి బోర్ మోటార్ సమకూర్చారు. సోమవారం బీజేపీ నాయకులతో కలిసి గుంటిపల్లిలో జరిగిన లింగమయ్య జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి బోర్ మోటారును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎద్దుల రాజు, ఎల్లన్న, రవి, భాస్కర్, ఊషన్న, అంజి, సూరి, చందు, శ్యాం, రాము, మధు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ

పాన్‌గల్: కారు, బైక్ ఢీకొన్న ఘటన మంగళవారం పాన్‌గల్‌లో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి నుంచి పాన్‌గల్ వైపు వస్తున్న బైక్, పాన్‌గల్ నుంచి వనపర్తి వెళ్తున్న కారు సబ్‌స్టేషన్ సమీపంలో గ్యాస్ గోదాం వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బైక్ నడుపుతున్న వ్యక్తి తలకు తీవ్ర గాయమైంది. వెంటనే బాధితుడిని అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో వివరాలు తెలియరాలేదు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నేడే పాఠశాలలు ప్రారంభం

- అసంపూర్తిగా అభివృద్ధి పనులు
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

పాన్‌గల్: మండలంలో వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి బుధవారం నుంచి ప్రారంభం అవుతున్నాయి. మండలంలోని పలు పాఠశాలలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు, మరమ్మతు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి. ఆయా మరమ్మతు పనులను సెలవుల్లోనే పూర్తి చేయాలని అధికారులు సూచించినా.. ఇంకా కొనసాగుతునే ఉన్నాయి. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పవు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో యూపీఎస్ 03, ఉన్నత పాఠశాలలు 11 ప్రాథమిక పాఠశాలలు 36 కలిపి మొత్తం 50 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 25 పాఠశాలలకు అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మరమ్మతు పనులు చేపట్టేందుకు రూ.50 లక్షలకు పైగా ప్రతిపాదనలు పంపగా వాటిలో 25 శాతం నిధులు మంజూరయ్యాయి. మంగళవారం మండలంలోని కిష్టాపూర్‌తండా, గోప్లాపూర్ తండా, అన్నారంతండా ప్రాథమిక పాఠశాలలు, గోప్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలను 'సాక్షి' సందర్శించి సమస్యలపై ఆరా తీయగా వాటిలో నెలకొన్న సమస్యలు ఇలా..

- కిష్టాపూర్ ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్ర శాలలు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యం వంటి పనులు పూర్తి కాలేదు. ఇంకా కొనసాగుతునే ఉన్నాయి.
- గోప్లాపూర్ ప్రాథమిక పాఠశాలల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రాథమికోన్నత పాఠశాలల్లోని మైదానం లోతట్టుగా ఉండటంతో వర్షపు నీరు చేరి విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- అన్నారంతండా ప్రాథమిక పాఠశాలల్లో ఐదు తరగతులకు రెండు గదులు ఉన్నాయి. దీంతో ఈ పాఠశాలల్లో గదుల కొరత ఉంది. పాఠశాల ఆవరణలో ఈదురు గాలులకు నెలకొరిగిన చెట్టు తొలగించకుండా అలానే ఉంచారు.



గోపాల్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా రాళ్లు, ఇటుకలు

వీపనగండ్ల కేజీబీవీలో దుర్వాసన

వీపనగండ్ల: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల ఉన్నత పాఠశాలలోని బాలికలు వినియోగించే మరుగుదొడ్డి గోడలు కూలిపోవడంతో పాఠశాల ఆవరణ అంతా దుర్వాసన వెదజల్లుతోంది. ఆరు నెలల క్రితం పడిపోయిన ఈ సెప్టిక్ ట్యాంకు గోడలను సరిచేయాలని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఎన్నో మార్లు విన్నవించారు. అయిన అధికారులు స్పందించకపోవడంతో బాలికల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. 210 మంది బాలికలు విద్యను అభ్యసించే ఈ పాఠశాలకు ఒకే మరుగుదొడ్డి ఉండడం, అది కూడా మరమ్మతుకు నోచుకోకపోవడంతో విద్యార్థులు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు భయపడుతున్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అదనపు గదుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు ఒక భవనం నిర్మాణం చేపట్టారు. గదుల నిర్మాణం పూర్తి అయినా.. పెయింటింగ్, ఇతర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పనులు ఇన్ని రోజులు కొనసాగడంతో ఇసుక, ఇటుకలు, కర్రలు, రాళ్లు ఆవరణలో అలాగే ఉన్నాయి. బుధవారం నుంచి పాఠశాలలు ప్రారంభం అవుతుతండడంతో వాటితో విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది.. అలాగే గోపాల్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కన ఇనుప చువ్వలు పడేశారు. ఆ పక్కనే పైకప్పు లేని నీటి సంపు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గోప్లాపూర్‌తండా ప్రాథమిక పాఠశాలలో పూర్తికాని మరమ్మతు పనులు



కిష్టాపూర్ ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న మరమ్మతు పనులు



రాజనగరం పాఠశాలలో కొనసాగుతున వంటగది పనులు

విద్యార్థులతో చాకిరీ



అమరచింత: పాఠశాల అవసరాల కోసం అప్పట్లో ప్రభుత్వం అటెండర్లతో పాటు స్వీపర్లను నియమించేది. గత ప్రభుత్వం స్వీపర్ల వ్యవస్థను ఎత్తివేయడంతో పాఠశాల తరగతి గదుల శుభ్రత వంటి పనుల్లో విద్యార్థులు పాల్గొంటున్న విషయం తెలిసిందే. కానీ అటెండర్ ఉన్న పాఠశాలకు వచ్చిన కొత్త పుస్తకాలను సైతం విద్యార్థులతో మోయించడంపై పులువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అమరచింత పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు మంగళవారం ఆత్మకూర్ నుంచి మినీ వాహనంలో పాఠ్యపుస్తకాలను తీసుకొచ్చేందుకు విద్యార్థులకు తీసుకెళ్లడం, వాటిని తరగతిలో పెట్టించడం వంటి పనులు చేయిస్తున్నారు. అక్కడే ఉన్న ఎంఈఓ భాస్కర్‌సింగ్ చూస్తూ ఉండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని రాజనగరం, వడ్డేగేరి, చిట్యాల తూర్పుతండా పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టుతున్న పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. వడ్డెగేరి పాఠశాలలో గేటు, గ్రిల్ తప్ప అన్ని పనులు పూర్తయ్యాయి. రాజనగరం ప్రాథమికోన్నత పాఠశాలలో నీటి ట్యాంక్ నిర్మాణం అసంపూర్తిగా ఉంది. చిట్యాల తూర్పుతండాలో నీటి ట్యాంక్ నిర్మాణం పూర్తి కాలేదు.

మూతబడిన పాఠశాలల పునఃప్రారంభం

ఖిల్లాఘనపురం: మండలంలో మూతబడిన ప్రభుత్వ పాఠశాలలను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంఈఓ ఉషారాణి తెలిపారు. మంగళవారం ఆమె మండల వ్యాప్తంగా గతంలో మూతబడిన కర్నెతండా, బక్కతండా, షాపురం తండా పాఠశాలలతో పాటుగా షాపురం, గార్లబండతండా, ఆముదంబండతండా పాఠశాలలను పరిశీలించారు. ఆయా తండాల్లో గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ఐదేళ్లు దాటిన చిన్నారులను విధిగా పాఠశాలలకు వచ్చేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు లేని ప్రభుత్వ పాఠశాలలను గతంలో మూసివేసినట్లు తెలిపారు. అలాంటి పాఠశాలలను పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయా గ్రామాలు, తండాల్లో బడిఈడు పిల్లలు నమోదు, వారు పాఠశాలలకు వచ్చేలా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు.



బక్కతండాలో చిన్నారులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ ఉషారాణి

'నీట్' అక్రమాలపై విచారణ చేపట్టాలి

అమరచింత: దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం నీట్ పరీక్ష రాసిన విద్యార్థులతో మాట్లాడారు. మే 4న జరిగిన నీట్ పరీక్షలకు దేశ వ్యాప్తంగా 24 లక్షల మంది పరీక్షలు రాశారన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి 1.40లక్షల మంది హాజరయ్యారని తెలిపారు. ప్రకటించిన నీట్ ఫలితాల్లో ఒకే సెంటర్‌లో పరీక్షలు రాసిన ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులు రావడం ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం సరికాదన్నారు. సమావేశంలో అభి, రోహిత్, ప్రణీత్, మార్టిన్, ఆదర్శ్, రిత్విక్, మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా లింగమయ్య జాతర



పూజలు నిర్వహిస్తున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: మండలంలోని గుంటిపల్లిలో లింగమయ్య జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఈసందర్భంగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ శివారులోని లింగమయ్య ఆలయం వద్ద గ్రామస్తులు తెల్లావారుజాము నుంచి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పొటేళ్లను బలిచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

విద్యుత్ కోతలపై ఆగ్రహం

మున్సిపాలిటీ కేంద్రంలో నిత్యం విద్యుత్ కోతలతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, చినుకు పడితే చాలు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని స్థానికులు ఎమ్మెల్యే దృష్టి తీసుకెళ్లారు. ఈవిషయమై ట్రాన్స్‌కో ఏఈ నర్సింహులుతో మాట్లాడి విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, తులసీరాజ్, పరమేష్, నల్గొండ శ్రీను, ఆంజనేయులు, మాసన్న, రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి

పెబ్బేరు రూరల్: కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకొని, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగించవద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో కొలువుదీరిన మోదీ ప్రభుత్వం ఇప్పటికైనా మతోన్మాద విధానాలు విడనాడాలని పిలుపునిచ్చారు. తాజా సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమికి ఓటర్లు తగిన బుద్ధి చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో మహమూద్, ఆర్ఎన్ రమేష్, బుచ్చమ్మ, శారద, నందిమళ్ల రాములు, బుచ్చన్న, నారాయణమ్మ, కవిత, సంధ్యారాణి, నాగేంద్రమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పుట్టా ఆంజనేయులు

అక్రమ కట్టడాలు తొలగించకుంటే చర్యలు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ రవీంద్ర, ఎంపీఓ రాజు మంగళవారం పరిశీలించారు. రెండు నెలల క్రితం కటికె ఖాజ అక్రమంగా నిర్మించిన షెడ్‌ను అధికారులు తొలగించారు. ఈ విషయంపై అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు. ఆ స్థలంలో అంగన్‌వాడీ కేంద్రం కంపౌండ్ నిర్మాణం కోసం ముగ్గు పోశారు. ఆ పనులను కటిక ఖాజ అడ్డుకోవడంతో అధికారులు అతడిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ ఇప్పటి వరకు చర్యలు లేకపోవడంతో అతడు మళ్లీ ఇటీవల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని రేకుల షెడ్డు నిర్మాణం చేసిన విషయాన్ని తెలుసుకున్న అధికారులు షెడ్‌ను తొలగించాలని కుటుంబ సభ్యులను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నందకిషోర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హామీ ఏమైంది?

పెబ్బేరు రూరల్: మున్సిపాలిటీలో వివాదంలో ఉన్న సంత స్థలంపై ఎమ్మెల్యే ఇచ్చిన హామీ ఏమైందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి ప్రశ్నించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మున్సిపల్ పాలకమండలి తీర్మానం చేసి పంపిస్తే నెల రోజుల్లో సంతకు చెందిన 30 ఎకరాల భూమిని సంతకు చెందే విధంగా చేస్తానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చెప్పిన మాట ఏమైందని వారు ప్రశ్నించారు. పూజారులకు చెందిన సంత స్థలం కోర్టు పరిధిలో ఉండడంతో అప్పటి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రోద్బలంతో పూజారులను ఒప్పించి 16 ఎకరాలను సంతకు కేటాయించి తహసీల్దార్ పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించారని గుర్తు చేశారు. సంత కోసం వాడుకుంటున్న స్థలానికి నష్ట పరిహారం ఇవ్వడం లేదని కలెక్టర్‌కు పూజారులు ఫిర్యాదు చేయడంతో ఆ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు, సౌకర్యాలు కల్పించడం లేదని పాలకవర్గం తెలిపారు. ఈ నేపథ్యంలో సంతకు సంబంధించిన టెండర్లు కూడా పిలవడం లేదన్నారు. దీంతో సంత నుంచి వచ్చే ఆదాయం మున్సిపాలిటీ కోల్పోయిందన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి సంత స్థలంపై ఇచ్చిన హామీని నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చిన్న ఎల్లారెడ్డి, పార్వతి, గోపిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ పాలకవర్గం

గడ్డివాము దగ్ధం

ఖిల్లాఘనపురం: ప్రమాదవశాత్తు ఓ గడ్డివాము మంటల్లో దగ్ధం కావడంతో యజమాని పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని సల్కెలాపురం గ్రామానికి చెందిన ఇర్ఫాన్ తన 12 ఎకరాల పొలానికి సంబంధించిన వరి గడ్డిని తండాకు సమీపంలో వాము పెట్టాడు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వాముకు నిప్పు పెట్టారు. తెల్లవారే సరికి సుమారు 4 ట్రాక్టర్ల వరి గడ్డి పూర్తిగా మంటల్లో కాలిపోయింది. గడ్డివాము మంటల్లో కాలిపోవడంపై అనుమానం వ్యక్తం చేసిన ఇర్ఫాన్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నామని ఎస్ఐ శ్రీహరి తెలిపారు.

అసంపూర్తిగా ఏఓ కార్యాలయ భవనం

కొత్తకోట రూరల్: మండల కేంద్రంలో 17ఏళ్ల క్రితం వ్యవసాయ అధికారి కార్యాలయ భవనం మంజూరైంది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కొంత వరకు పనులు చేసి నిధుల కొరత కారణంగా మధ్యలో నిలిపివేశాడు. నేటికీ సొంత భవనం లేకపోవడంతో ఏఓ, ఏఈఓలు ఇతర సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఏడీఏ, ఏఓ కార్యాలయం డ్వాక్రా మహిళా భవనంలో కొనసాగుతున్నాయి. ఈ భవనంలో ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో అధికారులు అవస్థలు పడుతున్నారు. 10ఏళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు తమకేమీ పట్టనట్టుగా ఉండిపోయారు. కొత్తకోట, మదనాపురం, ఆత్మకూర్, అమరచింత మండలాలకు కలిపి డివిజన్ స్థాయి అధికారి ఉండే విధంగా ఏడాది క్రితం ఏడీఏ కార్యాలయం మంజూరైంది. ఏడీఏ కార్యాలయం ఏర్పాటై ఏడాది గడుస్తున్నా నేటికీ సొంత భవనం లేదు. కార్యాలయ భవన నిర్మాణం కోసం రూ.40లక్షలు మంజూరైనట్లు ప్రాథమిక సమాచారం. అధికార పార్టీ నాయకులు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రస్తుత ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి భవన నిర్మాణ పనులు చేట్టాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.



పిల్లర్లకే పరిమితం అయిన డివిజన్ స్థాయి వ్యవసాయ అధికారి కార్యాలయ భవనం

కేంద్ర ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి

పాన్‌గల్: కులాలు, మతాల పేరుతో చిచ్చుపెట్టి రాజకీయ, ఆర్థిక లబ్ధి పొందేందుకు ప్రయత్నం చేస్తున్న మతోన్మాద శక్తులను దేశం నుంచి తరిమికొట్టాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్ అన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం గతంలో ఎన్నో హామీలు ఇచ్చిందని, వాటిలో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పినా వాటి గురించి ఏమాత్రం పట్టించుకోకుండా ఉన్న ఉద్యోగాలను ఊడదీసి లక్షలాది మందిని నిరుద్యోగులుగా మార్చిందని మండిపడ్డారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఎన్నడూ లేనంతగా ప్రస్తుతం నిరుద్యోగ సమస్య పెరిగిందన్నారు. త్యాగాల స్ఫూర్తితో సాధించిన స్వాతంత్య్ర ఉద్యమ చరిత్రను చెరిపి వేసి ఎలాంటి సంబంధం లేని వ్యక్తుల చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి విద్యను కాషాయీకరణ చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. సామాజిక అసమానతలు పెంచి పోషిస్తున్నారని, దళితులు, గిరిజనులు, మైనార్టీ వర్గాలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. మహిళలపై దాడులు జరుగుతున్న వారికి అండగా నిలువాల్సింది పోయి పాలపక్షాలు నిందితులకు అండగా నిలుస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు, మహేష్, రాజశేఖర్, రాజునాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనగంటి వెంకటేష్

సర్కార్ బడుల్లో మెరుగైన విద్య



పెద్దమారూర్‌లో మాట్లాడుతున్న మంత్రి కృష్ణారావు

చిన్నంబావి: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందుతుందని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆయన మండలంలోని పెద్దమారులో ప్రొ.జయశంకర్ బడిబాట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాల్లో మెరుగైన విద్యను అందించడంతో పాటు యూనిఫాం, మధ్యాహ్న భోజనం, నోట్, రాత పుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. పెద్దమారు పాఠశాల పునర్నిర్మాణం కోసం తన సొంత ఇధుల నుంచి రూ.25లక్షలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాసులు, ఎంఈఓ జంగిరెడ్డి ఉపాధ్యాయులు, రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ ధర్మతేజ, నాయకులు కళ్యాణ్‌రావు, విద్యాసాగర్ రావు, బీచుపల్లి యాదవ్, హన్మంత్‌రావు, రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్ రంజిత్‌కుమార్, ఎంపీటీసీ మహదేవ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలంటూ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.



మనిగిల్లలో హెచ్‌ఎం శంకర్‌గౌడ్



బుసిరెడ్డిపల్లిలో..

విలువలతో కూడిన విద్య

ఒత్తిడి లేని మెరుగైన, విలువలతో కూడిన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే దొరుకుతుందని మనిగిల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శంకర్‌గౌడ్ అన్నారు. మనిగిల్లలో ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న వసతుల గురించి వివరించారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో జ్యోతి, వెంకటేష్‌గౌడ్, బాలాజీ, సురేఖ, లావణ్య, శ్రీలక్ష్మి తదితరులు ఉన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు బుసిరెడ్డిపల్లి, తెల్లరాళ్లపల్లి, వెంగళాయిపల్లి, బండపల్లి గ్రామాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ బడిఈడు పిల్లలను తప్పక ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న వసతులను వివరించారు.

కాలి నడకన పోవాల్సిందే..



వనపర్తి: తన చిన్నతనంలో చదువుకోవాలంటే సమీపంలోని గ్రామానికి వెళ్లాల్సిందే అని ఎమ్మెల్యే మేఘారెడ్డి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఖిల్లాఘనపురం మండలంలోని సల్కెలాపురం నుంచి సమీపంలోని మామిడిమాడకు కాలినడకన, సైకిల్‌పై వెళ్లి 1 నుంచి 4వ తరగతి వరకు చదువుకున్నానని తెలిపారు. చదువుకునేందుకు అమ్మ ఎక్కువగా ప్రోత్సహించేదని.. నాన్న రెండు కిలోమీటర్లు సైకిల్‌పై ఎక్కించుకుని బడికి తీసుకువెళ్లేవారని పేర్కొన్నారు. ఆ తర్వాత ఇంటర్ వరకు ఖిల్లాఘనపురంలో పూర్తిచేశానన్నారు. ఆరో తరగతి వరకు ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టులు ఉండేవి కాదు. డిగ్రీ చదువుతున్న సమయంలో కుటుంబ బాధ్యతలు తీసుకోవాల్సి రావడంతో చివరి సంవత్సరంలో చదువు మానేసి వ్యాపారం వైపు వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. అమ్మకు ప్రమాదవశాత్తు మంటల్లో గాయాలు కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఉన్నత విద్యను పూర్తి చేయలేకపోయానని తెలిపారు. నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, విద్యార్థులకు ఎల్లవేళలా తన తోడ్పాటు ఉంటుందని భరోసానిచ్చారు.